http://www.agnidharanews.com
# అగ్నిధార
నిజాల నిప్పు కణిక
సోమవారం 5 అక్టోబర్ 2026
ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్
పేజీలు : 5 వెల : 5/-
Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో
## వేగం పెంచాలి



- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో షియర్‌జోన్ దాటిన తవ్వకాలు
- 2028 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు జరుగుతున్నాయి
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.
- ప్రధాన టన్నెల్‌లో ఇప్పటి వరకు 79 శాతం పనులు పూర్తి
- ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు.

హైదరాబాద్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు పడిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రమాదకరమైన షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గత ఐదు నుంచి ఆరు నెలల్లో సుమారు 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఎస్?ఎల్?బీసీ పనులపై అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. - మిగతా3లో



### అమెరికా కావాలనే
## ఒంటరి శక్తిగా మారింది

- చైనా ఎదుగుదలతో ప్రపంచంలో కొత్త పోటీ
- అమెరికా, చైనాపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- తన విధానాల్లో మార్పు చేసుకొని అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారిందని స్పష్టం
- అమెరికా- చైనా పోటీతో పరిస్థితులు మారిపోయాయన్న కేంద్ర మంత్రి
- అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్త అవకాశాలు

## గవర్నర్ కోటాపై
# కాంగ్రెస్ నజర్

- ఎమ్మెల్సీ రేసులో ఉన్నది వీరేనట..!
- తెలంగాణలో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ
- ఆశావహులు పార్టీ పెద్దలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ నేతలను కలుస్తున్నట్లు ప్రచారం
- ఈసారి సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తుండగా, రెండు స్థానాలను బీసీలకు కేటాయించే అంశంపై చర్చ
- పద్మశాలి, ముదిరాజు సామాజికవర్గాల నేతల పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి.



హైదరాబాద్

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ అంశం కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికరంగా మారింది. మూడు స్థానాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడకముందే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎమ్మెల్సీ పదవుల కోసం పార్టీ ముఖ్య నేతలతో పాటు ఢిల్లీ స్థాయిలోనూ లాబీయింగ్ మొదలైనట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పలువురు నేతలు ఇప్పటికే.. సీఎం రేవంత్ రెడ్డి అపాయిట్‌మెంట్ కోరినట్లు ప్రచారం.. అంతేకాకుండా.. పీసీసీ అధ్యక్షుడితో కూడా సమావేశం అవుతున్నారని పేర్కొంటున్నారు. అయితే.. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఆశావహులు తమకు అవకాశం దక్కేలా పార్టీ పెద్దలను కలుస్తున్నట్లు సమాచారం
ఈసారి ఎమ్మెల్సీ ఎంపికలో సామాజికవర్గాల సమీకరణలు కీలకంగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి - మిగతా3లో



### రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి
## చంద్రబాబుకు పంపిస్తున్నాడు

- కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు



## శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

- శిలాతోరణం వరకు బారులు తీరిన క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల అధిక రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు
- సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని అంచనా
- శనివారం శ్రీవారిని 91,296 మంది దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.5.06 కోట్ల ఆదాయం

## అమల్లోకి కొత్త
# మున్సిపల్ చట్టం

- ఇకపై సేవలు మంరిత సులభం!
- హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది.
- ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 70 ఏళ్ల నాటి జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో కోర్ అర్బన్ రీజియన్ చట్టం--2026 తీసుకొచ్చింది.
- అక్టోబర్ 2 నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చింది




హైదరాబాద్

హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. మున్సిపల్ శాఖను స్వయంగా చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నగర పాలనపై నేరుగా పర్యవేక్షణ సాగించేలా కొత్త వ్యవస్థలో కీలక మార్పులు చేశారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ పనిచేస్తుంది. నగరాభివృద్ధి ప్రాధాన్యాలను ఈ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. కార్పొరేషన్లు, పోలీస్, రెవెన్యూ, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్, మెట్రో, ఆర్టీసీ, హైడ్రా అధికారులు ఒకే వేదికపై చర్చించి నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కొత్త చట్టంలోకి వచ్చింది. 1955లో పాత మున్సిపల్ చట్టం వచ్చినప్పుడు హైదరాబాద్ జనాభా సుమారు 15 లక్షలు. ఇప్పుడు కోర్ అర్బన్ రీజియన్‌లో దాదాపు 1.3 కోట్ల మంది నివసిస్తున్నారు. నగరం భారీగా విస్తరించింది. వరదలు, ఎండ తీవ్రత, వాయు కాలుష్యం, నీటి కొరత, ట్రాఫిక్, చెరువులు--నాలాల ఆక్రమణలు, ఎత్తైన - మిగతా3లో



### కొత్త జాబ్ కార్డుల జారీకి
## లైన్ క్లియర్

- గ్రామీణులకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఉపాధి హామీ పథకం కింద కొత్త జాబ్ కార్డుల జారీకి ఆమోదం
- కరువు పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డుల విడుదలకు సిద్ధమైంది

హైదారాబాద్

తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా జాబ్ కార్డులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎల్‌నివో పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌నివో ప్రభావంతో గతంతో పోలిస్తే సాధారణ వర్షపాతం భారీగా పడిపోయింది. - మిగతా3లో



## ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

- ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి
- సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం
- దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

# అమల్లోకి కొత్త మున్సిపల్ చట్టం

-మొదటిపేజీ తరువాయి

భవనాల్లో అగ్నిప్రమాదాల ముప్పు వంటి కొత్త సవాళ్లు వచ్చాయి. ఈ మార్పులకు అనుగుణంగా నగర పాలనా వ్యవస్థను మార్చేందుకు ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. మూడు కార్పొరేషన్ల ప్రస్తుత సరిహద్దులు మాత్రం మారవు. మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ, కమిషనర్, వార్డు కమిటీ వ్యవస్థ కొనసాగుతుంది. ఐదేళ్ల పదవీకాలం కూడా యథాతథంగా ఉంటుంది.

**ఇంటి రిజిస్ట్రేషన్‌తోనే మ్యుటేషన్?**

ఇంటి కొనుగోలు తర్వాత మ్యుటేషన్‌కు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాన్ని కొత్త చట్టం తగ్గించనుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యూటేషన్ ఆటోమేటిక్‌గా కొనసాగుతుంది. ప్రతి ఆస్తికి ఇంటిగ్రేటెడ్ ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్ ఇస్తారు. ఆస్తికి సంబంధించిన మున్సిపల్ వివరాలన్నీ ఈ గుర్తింపు సంఖ్యతో అనుసంధానమవుతాయి. ఆస్తిపన్ను, నీటి బిల్లు, మురుగునీటి ఛార్జీలు, పారిశుద్ధ్య బకాయిలను కలిపి 'క్యూర్--1' పేరుతో ఒకే బిల్లు ఇస్తారు. మున్సిపల్ సేవలు, అనుమతులు, లైసెన్సులను ఒకే పోర్టల్ ద్వారా పొందే విధానం వస్తుంది.

**ఆస్తిపన్ను పెంపుపై పరిమితి**

ఈ కొత్త చట్టంలో ఆస్తిపన్ను విధానంలో కీలక మార్పు చేశారు. ఇక వార్షిక అద్దె విలువకు బదులుగా రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే గైడ్‌లైన్ విలువ ఆధారంగా పన్ను లెక్కిస్తారు. 375 చదరపు అడుగుల వరకు ఉన్న ఆస్తులకు రూ.101 నామమాత్రపు పన్నే కొనసాగుతుంది. మిగతా నివాస ఆస్తులకు గైడ్‌లైన్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం మధ్య రేటును ఆయా కార్పొరేషన్లు నిర్ణయిస్తాయి. నివాసేతర ఆస్తులకు 0.20 శాతం నుంచి 2 శాతం మధ్య రేటు ఉంటుంది. కొత్త రేట్లు ఖరారయ్యే వరకు నివాస ఆస్తులకు 0.15 శాతం వర్తిస్తుంది. నివాసేతర ఆస్తులకు 0.75 శాతం రేటు ఉంటుంది. కొత్త విధానంతో ఒక్కసారిగా పన్ను భారం పెరకుండా పరిమితులు విధించారు. గత ఏడాది పన్నుతో పోలిస్తే ఏ సంవత్సరంలోనూ పెరుగుదల 10 శాతం దాటదు. ప్రస్తుతం రూ.10 వేల ఆస్తిపన్ను చెల్లిస్తున్న వ్యక్తి మొదటి ఏడాది గరిష్ఠంగా రూ.11 వేలే చెల్లిస్తారు.

**భవన అనుమతుల్లో ఆలస్యానికి చెక్**

భవన అనుమతుల ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో సాగుతుంది. నిర్ణీత సమయంలో అధికారులు నిర్ణయం తీసుకోకపోతే దరఖాస్తు పైస్థాయికి వెళ్తుంది. నిర్ణయం రాని సందర్భాల్లో డీమ్డ్ అప్రూవల్‌కు చట్టం అవకాశం ఇస్తోంది. లైసెన్సింగ్ విధానాన్ని కూడా సులభతరం చేశారు. రాత్రివేళల్లో ఎక్కువ సమయం వ్యాపార కార్యకలాపాలు కొనసాగే నైట్ ఎకానమీ జోన్లను ప్రభుత్వం ప్రకటించనుంది. చిన్న ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులు పెట్టే పాత విధానంలోనూ మార్పు వస్తుంది. చాలా ఉల్లంఘనలకు సివిల్ జరిమానాలు ఉంటాయి. ముందుగా షోకాజ్ నోటీసు ఇస్తారు. ఆ తర్వాతే జరిమానాపై నిర్ణయం తీసుకుంటారు.

**రోడ్డు తవ్వాలంటే.. కమిటీ ఓకే చెప్పాలి**

నగరంలో ఒక శాఖ వేసిన రోడ్డును మరో శాఖ కొద్ది రోజులకే తవ్వే పరిస్థితులకు చెక్ పెట్టేలా కొత్త వ్యవస్థ వస్తోంది. యుటిలిటీ కోఆర్డినేషన్ కమిటీ రోడ్డు తవ్వకాలపై శాఖల మధ్య సమన్వయం చేస్తుంది. ట్రాఫిక్ నిర్వహణకు క్యూర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ అథారిటీ పనిచేస్తుంది. ఫుట్‌పాత్‌లు, పాదచారుల క్రాసింగ్‌లు, కర్బ్ ర్యాంపులు, వీధి దీపాలు, ట్రాఫిక్ సిగ్నళ్లపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. పాఠశాలల వద్ద సేఫ్ స్కూల్ జోన్లు ఏర్పాటు చేసే అవకాశం కూడా కొత్త చట్టంలో ఉంది.

**చెరువులు.. నాలాలకు మరింత రక్షణ**

చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల పరిరక్షణకు కొత్త చట్టం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. చెరువు, నాలా, ఇతర జలవనరుల్లో మురుగునీరు లేదా కాలుష్య వ్యర్థాలను వదలరాదు.చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో ఆక్రమణలు, వ్యర్థాలపై చర్యలకు హైడ్రాకు చట్టబద్ధమైన బలం లభిస్తుంది. నిర్మాణ వ్యర్థాలను అనుమతి లేకుండా పారేస్తే కఠిన జరిమానా ఉంటుంది. నాలా, చెరువు, ఫుట్‌పాత్‌పై పారేస్తే జరిమానా రెట్టింపు అవుతుంది. నిర్దేశిత విస్తీర్ణం దాటిన భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. పర్యావరణహిత చర్యలు తీసుకునే ఆస్తులకు అదనపు ఆస్తిపన్ను రాయితీ ఇచ్చే అవకాశం ఉంది.

**విపత్తులకు శాశ్వత ప్రణాళిక**

కోర్ అర్బన్ రీజియన్ మొత్తానికి ఒకే విపత్తు నిర్వహణ ప్రణాళిక ఉంటుంది. క్యూర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ విపత్తుల నివారణ, ముందస్తు సన్నద్ధత, స్పందన, పునరుద్ధరణ చర్యలను సమన్వయం చేస్తుంది. హైడ్రా విపత్తు స్పందన సంస్థగా పనిచేస్తుంది. ఎత్తైన భవనాలు సహా నిర్దేశిత భవనాలకు ఫైర్ ఆడిట్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసే అవకాశం ఉంటుంది. ప్రమాద స్థాయిని బట్టి తనిఖీలు చేపడతారు. ప్రాణాలకు తక్షణ ముప్పు ఉన్న భవనాన్ని లోపాలు సరిచేసే వరకు సీల్ చేయవచ్చు. వీధులు, పార్కులు, బస్‌స్టాప్‌లు, రవాణా కేంద్రాల్లో తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలి. మార్కెట్లు, రవాణా ప్రాంతాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో సీసీ కెమెరాల నిఘాకు చట్టం ప్రాధాన్యం ఇచ్చింది.

**మహిళలు.. వృద్ధులు.. గిగ్ కార్మికులపై దృష్టి**

మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు, చిన్నారులు, వృద్ధుల అవసరాలను నగర మౌలిక వసతుల్లో పరిగణనలోకి తీసుకోవాలని కొత్త చట్టం చెబుతోంది. జెండర్ ఇన్‌క్లూజన్ సెల్ ఏర్పాటు చేస్తారు. ప్రతి కార్పొరేషన్‌లో ట్రాన్స్‌జెండర్ సమాజం నుంచి ఒకరికి ప్రాతినిధ్యం ఉంటుంది. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు విశ్రాంతి ప్రదేశాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, పార్కింగ్, ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్లలో మౌలిక సదుపాయాలు అందించవచ్చు.

**కాలం చెల్లిన నిబంధనలకు తెర**

70 ఏళ్ల నాటి చట్టంలో వందకు పైగా కాలం చెల్లిన నిబంధనలు ఉన్నాయి. టాంగాలు, జట్కాలు, ఎద్దుల బండ్లు, గుర్రాలు, ఒంటెలు, ఏనుగులపై పన్నుల ప్రస్తావన కూడా పాత చట్టంలో ఉంది. నగరంలోకి వచ్చే సరుకుపై ఆక్ట్రాయ్ వసూలు, ఆవిరి విజిల్ వాడకంపై అనుమతి, ఐదు నుంచి ఇరవై రూపాయల జరిమానాలు వంటి పాత నిబంధనలకు కొత్త చట్టం ముగింపు పలికింది.

# గవర్నర్ కోటాపై కాంగ్రెస్ నేతల నజర్

-మొదటిపేజీ తరువాయి

సామాజికవర్గానికి కేటాయించిన నేపథ్యంలో.. గవర్నర్ కోటాలో బీసీ సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది

**రెండు స్థానాలు బీసీలకు**

మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీ సామాజికవర్గాలకు కేటాయించే అంశంపై కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీకి రాజకీయంగా ఉపయోగపడే నేతలను ఎంపిక చేయాలనే ఆలోచనలో నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

**పద్మశాలి కోటాపై సిరిసిల్ల సభలోనే హామీ**

పద్మశాలి సామాజికవర్గానికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించే అంశంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభలో కీలక ప్రకటన చేసిన విషయం చర్చనీయాంశంగా మారింది. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని పెద్దల సభకు పంపుతామని సిరిసిల్ల సభ వేదికగా సీఎం హామీ ఇచ్చిన నేపథ్యంలో.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి ఆ సామాజికవర్గానికి దక్కే అవకాశం ఉందనే చర్చ కాంగ్రెస్‌లో మొదలైంది. పద్మశాలి కోటాలో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, పున్న కైలాష్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సీఎం హామీ నేపథ్యంలో ఈ ఇద్దరి పేర్లపై పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది

**ముదిరాజు కోటాలో ఎమ్మెల్సీ పదవి..**

మరో ఎమ్మెల్సీ స్థానాన్ని ముదిరాజు సామాజికవర్గానికి కేటాయించే అంశాన్ని కాంగ్రెస్ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ముదిరాజు సామాజికవర్గం గణనీయమైన జనాభాను కలిగి ఉండటంతో ఆ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచన పార్టీలో ఉన్నట్లు తెలుస్తోంది.

ముదిరాజు కోటాలో మెదక్ ఎంపీ అభ్యర్థి గా పోటీ చేసిన



నీలం మధు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ ముఖ్య నేతలను కలిసి ఎమ్మెల్సీ అవకాశం కోసం తన ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే ఎంపీ ఎన్నికల తర్వాతా నీలం మధుకు సీఎం హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి పెద్దపీఠ వేయాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇది కనుక వర్కౌట్ అవుతుందా లేదా చూడాల్సి ఉంది.

**బీసీ కోటాలో పలువురి పేర్లు**

బీసీ కోటాలో ఎమ్మెల్సీ పదవి కోసం పలువురు నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. చనగాని దయాకర్, సత్తు మల్లేశ్, కౌశిక్ యాదవ్ పేర్లు కూడా పార్టీలో చర్చకు వస్తున్నట్లు సమాచారం..

**మూడో సీటుపై ఆసక్తికర సమీకరణం..**

మూడు స్థానాల్లో మూడో సీటును రెడ్డి సామాజికవర్గానికి కేటాయించే పరిస్థితి వస్తే ఆర్టీఐ కమిషనర్ అయోధ్యారెడ్డి పేరు కూడా రేసులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. మొత్తంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తోంది. సామాజికవర్గాల ప్రాతినిధ్యం, పార్టీ విధేయత, రాజకీయ సమీకరణాలు.. ఈ అంశాల ఆధారంగా తుది ఎంపిక ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆశావహుల జాబితాపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ కొనసాగుతోంది.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో వేగం పెంచాలి

-మొదటిపేజీ తరువాయి

43.968 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్‌లో ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తికాగా మరో 9.1 కిలోమీటర్ల తవ్వకాలు మిగిలి ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్? కుమార్? రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ప్రస్తుతం రోజుకు 7 నుంచి 7.5 మీటర్ల మేర పనులు జరుగుతున్నాయని, అదనపు డ్రిల్లింగ్ బూమర్, ఎలక్ట్రిక్ లోడర్లు, ఆధునిక ఎక్స్‌కవేటర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. జర్మనీ నుంచి అక్టోబర్ చివరికి లోకోమోటివ్ రానుందని, దీంతో టన్నెల్‌లో తవ్విన మట్టిని వేగంగా బయటకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో 48 గంటలు పట్టిన నిర్మాణ సైకిల్ ప్రస్తుతం 20--24 గంటలకు తగ్గిందని, దాన్ని సుమారు 10 గంటలకు తగ్గించి పనుల వేగం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మే--జూన్ 2028 నాటికి టన్నెల్-1 బ్రేక్‌త్రూ పూర్తి చేసి జూన్ 2028 నాటికి నీటిని అందించేలా పనులు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్మికుల భద్రతకు అత్యంత



ప్రాధాన్యత ఇస్తూ పనులు కొనసాగించాలని సూచించారు.

**ప్రత్యేక బృందంతో పర్యవేక్షణ**

ఎస్?ఎల్బీసీ సొరంగం పనులు మళ్లీ వేగం పుంజుకుంటున్నాయి. గతంలో జరిగిన ప్రమాదం అనంతరం కొంతకాలం నిలిచిపోయిన పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం తిరిగి ప్రారంభించింది. టన్నెల్ పనులను పూర్తి చేయడంలో వేగంతో పాటు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఎస్?ఎల్?బీసీ సొరంగం పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సైన్యంలో సొరంగాల నిర్మాణంలో పనిచేసిన నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా వీటిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. సొరంగం పనులు వేగవంతం చేసేందుకు అత్యాధునిక త్రీఆర్మ్ బూమర్ యంత్రాన్ని రంగంలోకి దించారు. జపాన్ నుంచి సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ యంత్రంను తీసుకొచ్చారు. ఇప్పటివరకు సొరంగం ఎగువ, దిగువ భాగాల్లో వేర్వేరుగా తవ్వకాలు చేపట్టాల్సి వచ్చేది. త్రీఆర్మ్ బూమర్ అందుబాటులోకి రావడంతో ఒకేసారి పూర్తి భాగాన్ని తవ్వే అవకాశం ఏర్పడింది. సుమారు 10 మీటర్ల వ్యాసంతో సొరంగం తవ్వే సామర్థ్యం ఈ త్రీఆర్మ్ బూమర్ యంత్రానికి ఉంది.

## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

## కొత్త జాబ్ కార్డుల జారీకి లైన్ క్లియర్..



-మొదటిపేజీ తరువాయి

దీని వల్ల రైతులు పంట సాగుకు దూరం కావడంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరువు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట సాగు తగ్గిపోవడం, కూలీలకు పని లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో అలాంటివారికి ఉపయోగపడేందుకు కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేసుకున్నవారికి 15 రోజుల్లో జాబ్ కార్డు అందించేలా ప్రణాళికలు రచించింది. దీని వల్ల వారికి వెంటనే ఉపాధి లభించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 52.46 కుటుంబాల్లోని 1.08 కోట్ల మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. కరువు పరిస్థితుల క్రమంలో కొత్తగా ఉపాధి పొందాలనుకునేవారికి జాబ్ కార్డులు జారీ చేయనున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆదాయం లభించనుంది. ఉపాధి అవసరం ఉన్నవారిని గుర్తించి ఈ పథకంలో నమోదు చేయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ పథకంలో చేరాలంటే 18 ఏళ్లు తప్పనిసరిగా నిండి ఉండాలి. దరఖాస్తు ఫారంను పూర్తి చేసి ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫొటోను జత చేయాలి. ఆ తర్వాత దరఖాస్తును ఫారంను మీ గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి పరిశీలన అనంతరం మీ దరఖాస్తును మండల కార్యాలయానికి పంపిస్తారు. ఎంపీడీవో దరఖాస్తును పరిశీలించి మీ అర్హతలను తనిఖీ చేస్తారు. అర్హతలు ఉంటే జాబ్ కార్డు జారీ చేస్తారు. అనంతరం మీకు ఈ జాబ్ కార్డును అందిస్తారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా జాబ్ కార్డు అందించాలని ప్రభుత్వం నిబంధనలు విధిస్తోంది.

ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. దీని వల్ల గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపింది. అయితే కేంద్రం వీబీ జీరాంజీ పథకంలో అనేక మార్పులు చేసింది. పనిదినాలతో పాటు కనీస వేతనాన్ని కూడా పెంచింది. వారం రోజుల్లో డబ్బులు క్రెడిట్ చేసేలా కొత్త మార్గదర్శకాలు రూపొందింది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్రం ఈ స్కీమ్ అమలు చేస్తోంది.

## విద్యార్థులకు అల్పాహారం కోసం కమ్యూనిటీ కిచెన్



**సూర్యాపేట:** జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం. ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల--మాధారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.

## సంపాదకీయం

# కాలుష్యకాలంలో ఢిల్లీ!

ఢిల్లీలో ఈ సమయంలో సర్వసాధారణంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయంటే, అదేమీ సంతోషించాల్సింది కాదు. 2008 తరువాత సెప్టెంబర్ నెలాఖరులో అత్యల్ప ఉష్ణోగ్రత రికార్డు కావడమన్నది నగరం చల్లబడిందని కాక, దేశ రాజధాని మళ్ళీ కష్టకాలంలోకి జారుకుంటోందన్న హెచ్చరిక. వాయు కాలుష్యంతో ఈ శీతాకాలంలో నగరవాసులు మరోమారు నరకం అనుభవించబోతున్నారని అర్థం. ప్రతి ఏటా ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు కొన్ని ప్రకటిస్తుంది. శీతాకాలంలో పాలకులకు ఇది ఒక క్రమం తప్పలేని ఎజెండా. సోమవారం కూడా మళ్ళీ అదే జరిగింది. పలురకాల నిర్మాణాలమీద నిషేధం విధించారు, కార్యాలయ వేళల్లో మార్పుచేర్పులు ప్రకటించారు, ఆఫీసులకు వచ్చిపనిచేసే సిబ్బందిలో సగంమందిని ఇంటినుంచి పనిచేయాలంటున్నారు, నగరం బయట రిజిస్టరయిన వాహనాల నగర ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు, పార్కింగ్ చార్జీలు కూడా పెంచారు. ఈ జాబితాలో ఏవి ఎప్పటినుంచి అమల్లోకి రాబోతున్నాయన్నది అటుంచితే, శీతాకాలం ప్రవేశం వరకూ ఇష్టారాజ్యంగా సాగినవన్నీ, ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైనవిగా తోచడం, పరిణమించడం విశేషం. ఇప్పటిచలి తాత్కాలికమేనని, అల్పపీడన ప్రభావం తగ్గితే పరిస్థితిలో కాస్తంత మార్పు రావచ్చని అంటున్నప్పటికీ, కాస్తంత అటూఇటూగా ఈ సంక్షోభం ఏటా ఎదుర్కోక తప్పనిదే. నిర్మాణాలు, కూల్చివేతలమీద పూర్తిస్థాయి నిషేధాన్ని అటుంచితే, ఇప్పటికే అమలులో ఉన్న 'నో ఫ్యూయల్–నో పీయూసీ' విధానాన్ని మరింత కఠినంగా అమలు చేస్తారట. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు ఉన్న ఐదువందల పెట్రోల్ బంకుల్లో పాతవాహనాలమీద విరుచుకుపడతారట. రెండున్నర లక్షలవాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయబోతున్నట్టు, ఉన్న ఐదువేల ఎలక్ట్రిక్ బస్సులకు మరో నూటయాభై బస్సులను చేర్చి ప్రజారవాణాను మెరుగుపరచనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. పార్కింగ్ ఫీజులను భారీగా పెంచితే, ప్రజలు విధిగా ప్రజారవాణావైపు పరుగులు తీస్తారని అది బలంగా నమ్ముతున్నట్టు కనిపిస్తోంది. ప్రజలు నిజంగానే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీదే ఆధారపడితే, ఢిల్లీలో ఉన్న ఆ వ్యవస్థ ఏమాత్రం సరిపోదు. పద్నాలుగువేల బస్సులు అవసరమైన చోట సగం మాత్రమే ఉన్నాయి, నగరంలోని మొత్తం ప్రయాణికుల్లో ఐదుశాతం జనాభాను మాత్రమే మెట్రో తీసుకుపోతోంది. ఇక, వెచ్చదనంకోసం ప్రజలు చెత్తనీ, బొగ్గూకట్టెలూ కాల్చకుండా నిరోధించడానికి తాత్కాలికంగా విద్యుత్ హీటింగ్ స్పాట్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలంతా అక్కడికే వెళ్ళి చలికాచుకుంటారని కూడా ప్రభుత్వం నమ్మకం. కాలుష్యకాలం కమ్ముకొచ్చినప్పుడు, బాణాసంచా వినియోగం కూడా ఒక పెద్దసమస్యగా, వివాదంగా మారడం ఏటా ఉన్నదే. టపాసుల వాడకంమీద ఆంక్షలు విధించాలంటూ దాఖలైన పిటిషన్‌మీద సుప్రీంకోర్టు బుధవారం తన అభిప్రాయాన్ని ప్రకటిస్తూ, పూర్తి నిషేధానికి తాను అనుకూలం కాదని, అలాగని, రోజంతా కాల్చడానికి ఒప్పుకోనని వ్యాఖ్యానించింది. కొన్ని రకాల టపాసుల తయారీకి కూడా ఇకపై వీలు కలగబోతోంది. దీపావళినాడు బాణాసంచా కాల్చే విషయంలో సుప్రీంకోర్టు వైఖరిలో ఇటీవల పెనుమార్పు వచ్చిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏలుబడిలో ఉన్నంతకాలం ఢిల్లీలో టపాసులమీద నిషేధం అమలైంది. మొదట్లో బేరియం లవణాలు లేని టపాసుల తయారీకి అనుమతించినప్పటికీ, ఆ మినహాయింపు కూడా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం అమలైంది. పాలకుల, న్యాయస్థానాల చొరవవల్ల, పెరిగిన కాలుష్యభయం వల్ల ఢిల్లీ వాసుల్లో కూడా టపాసులమీద మోజు తగ్గింది. విపక్షంలో ఉండగా, ఈ నిషేధాన్ని తప్పుబడుతూ వచ్చిన బీజేపీ ఢిల్లీలో తాను అధికారంలోకి రాగానే టపాసులపై సర్వోన్నత న్యాయస్థానంతోనే సరే కానివ్వండని అనిపించుకుంది. పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒక బలమైన కారణం కనుక, పరిస్థితిలో మార్పు వస్తున్నా ఈ మారు కూడా ఆ ప్రభావాన్ని కాదనలేం. ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో అనేకం గతకాలంలోనూ అమలు జరిగినవే. గద్దెమీద ఎవరున్నా ఈ తక్షణ ఉపశమన చర్యలనే మహాద్భుతమైనవిగా అభివర్ణించుకోవడం సహజం. గ్యాస్ చాంబర్‌లాగా తయారైన ఢిల్లీలో వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్న సామాన్యులకు ఏటా వచ్చే ఈ ఆపదనుంచి విముక్తి ఎప్పుడో తెలియడం లేదు.

# పాన్ ఐఐటీ.. రాష్ట్ర భవిష్యత్తుకు ఇన్నోవేషన్ ఇంజిన్



ఒక రాష్ట్రాన్ని మార్చేది కేవలం భారీ పెట్టుబడులు కాదు. ఆ పెట్టుబడులకు దారితీసే ఆలోచనలు, ఆ ఆలోచనలను ఆవిష్కరణలుగా మలిచే పరిశోధన, ఆ ఆవిష్కరణలను పరిశ్రమలుగా తీర్చిదిద్దే సమర్థ వ్యవస్థ. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న ప్రస్తుత సమయంలో ఒక రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేది కేవలం సహజ వనరులు మాత్రమే కాదు.. జ్ఞానం, నైపుణ్యం, సాంకేతికత, ఆవిష్కరణ సామర్థ్యం. అందుకే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో పాన్ ఐఐటీ వంటి మేధో వేదికకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

నేడు విజయవాడలో జరగనున్న పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్ ఈ దిశగా ఒక ముఖ్యమైన ప్రయత్నం. దేశ విదేశాల్లో ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, పాలసీ రూపకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం దీని ప్రధాన ఉద్దేశం. వారి అనుభవం, పరిజ్ఞానం, పరిచయాలు, పెట్టుబడి సామర్థ్యాన్ని ఏపీ అభివృద్ధికి అనుసంధానం చేయడం ద్వారా కొత్త అవకాశాలను సృష్టించవచ్చు.

అమెరికాలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం చుట్టూ ఏర్పడిన పరిశోధన, పరిశ్రమ వాతావరణం సిలికాన్ వ్యాలీకి బలమైన పునాది వేసింది. జర్మనీలోని ఫ్రాన్‌హోఫర్ సంస్థలు పరిశోధనను పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేసి సాంకేతికతను వాణిజ్యీకరణ దిశగా తీసుకెళ్తున్నాయి. ఇజ్రాయెల్ స్టార్టప్ వ్యవస్థ, సింగపూర్ పరిశోధన–– పరిశ్రమ అనుసంధానం, తైవాన్ సెమీకండక్టర్ పర్యావరణం కూడా నాలెడ్జ్ ఆర్థిక శక్తిగా ఎలా మారుతుందో చూపిస్తున్నాయి.

ఈ నమూనాల నుంచి రాష్ట్రం నేర్చుకోవాల్సిన ప్రధాన విషయం ఒక్కటే. ప్రతిభను ఒకచోట చేర్చడం మాత్రమే కాదు.. ఆ ప్రతిభను రాష్ట్రాభివృద్ధి అవసరాలతో అనుసంధానం చేయాలి. రాష్ట్రంలోని సమస్యలకు ఐఐటీలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమలు కలిసి పరిష్కారాలు చూపే విధానం రావాలి. కొత్త ఆలోచనలు ప్రోటోటైప్‌లుగా మారాలి. ప్రోటోటైప్‌లు స్టార్టప్‌లుగా మారాలి. స్టార్టప్‌లకు పెట్టుబడులు రావాలి. అవి పరిశ్రమలుగా ఎదిగి ఉపాధి కల్పించాలి. ఆ ఉపాధి, ఉత్పాదకత చివరకు... రాష్ట్ర ఆర్థిక వృద్ధికి బాట వేయాలి అనే వ్యవస్థ రాష్ట్రంలో ఏర్పడాలి. ఇదే నిజమైన ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్.

దేశం కూడా ఇదే దిశగా అడుగులు వేస్తోంది. ఇండియా ఏఐ మిషన్, నేషనల్ క్వాంటమ్ మిషన్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ వంటి కార్యక్రమాల ద్వారా కృత్రిమ మేధస్సు, క్వాంటమ్, డీప్‌టెక్, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ, మెడికల్ డివైజెస్ వంటి రంగాల్లో పరిశోధన, ప్రైవేట్ పెట్టుబడులకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ జాతీయ అవకాశాలను రాష్ట్ర అవసరాలతో అనుసంధానం చేసుకోవడం కీలకం. ఈ నేపథ్యంలో అమరావతిలో ఏఐ, క్వాంటమ్ రంగాలకు ప్రత్యేక యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు ఎన్ఐఈఎల్ఐటీ, రాష్ట్రం మధ్య జరిగిన ఒప్పందం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్ ఏఐ/ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ హార్డ్‌వేర్, ఏఐ––క్వాంటమ్ రీసెర్చ్, ఇండస్ట్రీ లింక్‌డ్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, డీప్‌టెక్ ఇంక్యుబేషన్ వంటి రంగాలను ఒకే పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచన భవిష్యత్ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా ఉంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఐబీఎంతో భాగస్వామ్యం, క్వాంటమ్ కంప్యూటింగ్ మౌలిక వసతుల ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలు కూడా ఈ దిశలోనే ఉన్నాయి. అయితే ఇలాంటి ప్రాజెక్టులు, సంస్థలు ఏర్పడితేనే సరిపోదు. వాటి చుట్టూ పరిశోధన, పెట్టుబడి, పరిశ్రమ, స్టార్టప్ వ్యవస్థ ఏర్పడాలి. ఒక ఆలోచనకు నిధులు దొరకాలి. ఒక పరిశోధనకు పరిశ్రమ భాగస్వామ్యం కావాలి. ఒక స్టార్టప్‌కు మార్కెట్ దొరకాలి. ఒక విద్యార్థికి ప్రపంచస్థాయి మెంటార్ లభించాలి. ఒక పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం రాష్ట్రంలోనే అందుబాటులో ఉండాలి. అప్పుడే మేధస్సు ఆర్థిక విలువగా మారుతుంది. పాన్ ఐఐటీని ఈ మొత్తం వ్యవస్థకు అనుసంధానించే వేదికగా మలచాల్సిన అవసరం ఇక్కడ కనిపిస్తుంది. కేవలం ఏడాదికి ఒకసారి జరిగే సదస్సుగా కాకుండా, పాన్ ఐఐటీ అమరావతి కౌన్సిల్, గ్లోబల్ ఐఐటీ మెంటార్ నెట్‌వర్క్, డీప్‌టెక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ పరిశ్రమలతో అనుసంధానమైన పరిశోధన కేంద్రాలు వంటి శాశ్వత వ్యవస్థలు ఏర్పడితే దాని ప్రభావం మరింత విస్తరించవచ్చు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని వివిధ రంగాలకు ఈ మేధోశక్తిని అనుసంధానం చేయవచ్చు.

ప్రపంచం ఇప్పుడు ఏఐ, క్వాంటమ్, సెమీ కండక్టర్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, స్పేస్‌టెక్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కొత్త పోటీని చూస్తోంది. రేపటి ఆర్థిక శక్తి ఈ సాంకేతిక రంగాల్లోనే రూపుదిద్దుకోనుంది. ఈ పోటీలో నిలబడాలంటే భౌతిక మౌలిక వసతులతో పాటు మేధో మౌలిక వసతులు కూడా నిర్మించాలి. పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువత నైపుణ్యాలను పెంచాలి. ఆవిష్కరణలకు పెట్టుబడులు అందించాలి. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య దూరాన్ని తగ్గించాలి. అందుకే పాన్ ఐఐటీని మరో సదస్సుగా చూడకూడదు. వికసిత్ భారత్––2047 లక్ష్యానికి అనుగుణంగా జ్ఞానాధారిత, సాంకేతికంగా శక్తిమంతమైన, ఆవిష్కరణలకు నిలయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే దీర్ఘకాలిక వేదికగా మలచాలి. ప్రపంచ ఐఐటీ మేధస్సును రాష్ట్ర భవిష్యత్తుతో అనుసంధానం చేయగలిగితే.. పాన్ ఐఐటీ ఒక కార్యక్రమంగా కాక, రాష్ట్ర భవిష్యత్తును నడిపించే ఇన్నోవేషన్ ఇంజిన్‌గా రూపుదిద్దుకుంటుంది.

# ప్రభుత్వ వ్యతిరేకత'కు బీజేపీ అతీతమా?

రాహుల్‌గాంధీ ఇటీవల ఒక ప్రశ్న అడిగారు. రాజకీయ వర్గాలలో కలకలం సృష్టించిన ఆ ప్రశ్న సులభంగా ఉన్నట్టు కనిపిస్తున్నా నిజానికి సంక్లిష్టమైనది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారతీయ జనతా పార్టీ ఒక దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావానికి ఎందుకు గురికావడం లేదు? 1977లో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్న కారణంగా మా నానమ్మ ఇందిర సైతం ఓడిపోయారు అని ఆయన అన్నారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలో కొనసాగేలా ఎన్నికల ప్రక్రియను తారుమారు చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఎన్నికల్లో జయాపజయాల విషయమై రాహుల్ ఇటీవల చేసిన వివిధ వ్యాఖ్యలలో మాదిరిగానే తాజా ఆరోపణలో కూడా ఒక ఇబ్బందికరమైన సత్యం ఉంది. ఒక విషయంలో రాహుల్ సరిగానే మాట్లాడారు. ఎన్నికల సంఘం తీవ్ర విశ్వసనీయత లోటును ఎదుర్కొంటోంది. అవును, ఈ సత్యం ఇంకెంత మాత్రం ఒక చర్చనీయాంశంగా ప్రతిపక్షాలకే పరిమితమై లేదు. ఈసీఐపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారనడం సత్యదూరం కాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లు నివేదించిన వివరాలలో 'తార్కిక వ్యత్యాసం'కు సంబంధించిన సమస్యలు, లక్షలాది ఓటర్ల తొలగింపుపై రగడ, ఓటర్ల అప్పీళ్లపై విచారణలో జాప్యం మొదలైనవన్నీ ఎన్నికల సంఘం పారదర్శకతపై న్యాయబద్ధమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాజ్యాంగ సంస్థల మధ్య 'విశ్వాస లోటు' ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించిందంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ఓటర్ జాబితాల ధర్మబద్ధత గురించి పట్టించుకునే ఎవరికైనా ఈ అంకెలు ఆందోళన కలిగిస్తాయి. బెంగాల్‌లో ఇంతవరకు 22 లక్షల మంది పౌరులు తమ ఓటు హక్కు తొలగింపుపై అప్పీల్ చేశారు. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93శాతం మంది చట్టబద్ధమైన ఓటర్లే అని నిర్ధారణ అయింది. ఎన్నికలు అంటే కేవలం పోలింగ్ రోజున జరిగే ప్రక్రియ మాత్రమే కాదు. ఓటర్ జాబితాలలో ఎవరికి చోటు దక్కుతుందనే అంశంతోనే నిజానికి ఎన్నికలు ప్రారంభమవుతాయి. మరి తన పనితీరుపై ఆందోళనలను కేవలం రాజకీయ ఆరోపణలు మాత్రమేనని ఎన్నికల సంఘం ఎలా కొట్టివేయగలుగుతుంది? ఎన్నికల సంఘం తటస్థ మధ్యవర్తిగా వ్యవహరించడం లేదనే ఆందోళనలు ఇటీవల వివిధ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించిన తీరుతెన్నుల ఆధారంగానే వ్యక్తమవుతున్నాయన్నది నిరాకరించలేని వాస్తవం.

మన దేశంలో ఒపీనియన్ పోల్స్ నిర్వహించే ఏజెన్సీలు కూడా రాజకీయ కుట్రల్లో భాగమా? 2014 నుంచి నరేంద్ర మోదీకి ప్రజాదరణ–– ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలోను, పశ్చిమ భారత రాష్ట్రాలలోనూ అంతకంతకూ పెరుగుతోందని అన్ని ఒపీనియన్ పోల్స్ ఫలితాలు నిర్ధారిస్తూనే ఉన్నాయి. ఆ పోల్స్ అన్నీ ప్రామాణిక పద్ధతులలో జరిగి ఉండకపోవచ్చు. అయినంతమాత్రాన వాటి ఫలితాలకు కారణమైన రాజకీయ పరిణామాన్ని కొట్టివేయడం సబబు కాదు. దానిని నిష్పాక్షికంగా అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి అసాధ్యంగా ఉన్న మహా శక్తిమంతమైన రాజకీయ, సంస్థాగత యంత్రాంగాన్ని బీజేపీ అభివృద్ధిపరచుకున్నది. కార్యకర్తల బలాన్ని అపారంగా పెంచుకున్నది. పైగా ఆరెస్సెస్ నుంచి సంపూర్ణ మద్దతు బీజేపీకి లభిస్తోంది. ఆర్థిక వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. పార్టీ సందేశాలను ప్రభావదాయకంగా ప్రజలలోకి తీసుకువెళ్లే సామర్థ్యం తక్కువేమీ కాదు. కనుకనే జాతీయ ప్రాధాన్యమున్న అంశాలను ఎన్నికల ప్రచారానికి చాలా నేర్పుగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడంలో బీజేపీ సదా సఫలమవుతోంది.

ఎన్నికల వ్యయాలపై ఈసీఐకి నివేదించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది ఐదు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మొత్తం రూ.529.38 కోట్లు ఖర్చు చేసింది. ఆ ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన వ్యయం రూ. 248.55 కోట్లు. బీజేపీ ఒక్క బెంగాల్‌లోనే చేసిన వ్యయం, ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఖర్చు చేసిన మొత్తం కంటే ఎక్కువగా ఉన్నది. ఈసీఐ వెల్లడించిన లెక్కల ప్రకారం, బెంగాల్‌లో బీజేపీ ఎన్నికల వ్యయం రూ.286.99 కోట్లుగా ఉన్నది. ఆయా పార్టీలు చేసిన వ్యయాలు ఇంకా అధికంగా ఉంటాయనడంలో సందేహం లేదు. అయితే అవేవీ ఎన్నికలలో అక్రమాలు జరిగాయన్న విషయాన్ని రుజువు చేయలేవు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల కాలంలోనే తమకు అందిన విరాళాలు మొత్తం రూ.1,473 కోట్లు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయం వెల్లడించింది. అదే కాలంలో కాంగ్రెస్‌కు విరాళాల రూపేణా కేవలం రూ.207 కోట్లు మాత్రమే సమకూరాయి. చెప్పవచ్చినదేమిటంటే ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి ఎలాంటి కుట్ర సిద్ధాంతాలు అవసరం లేదు. గతంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రధాన ప్రతిపక్షం అధికార పార్టీతో సమానంగా సమర్థ యంత్రాంగాన్ని ఎందుకు నిర్మించుకోలేకపోయింది? ఈ ప్రశ్నను రాహుల్‌గాంధీ ఎదుర్కోవాలి.

కాంగ్రెస్‌కు వాటిల్లిన సమస్యలన్నిటికీ ఈసీఐని తప్పుపట్టడం ఎంతమాత్రం వివేకం కాదు. నాయకత్వ తగాదాలు, సంస్థాగత క్షీణత, ముఠాల కుమ్ములాటలు, ఫిరాయింపులు, బలహీనపడిన పీసీసీలు మొదలైనవన్నీ కాంగ్రెస్ స్వయంకృతాలే కానీ ఈసీఐ ప్రమేయంతో జరిగినవి కావు కదా. ఇదిగో ఇక్కడే ప్రభుత్వ వ్యతిరేకత అనే వాదన మరింత ఆసక్తికరమవుతోంది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఉంది. అదొక వాస్తవం. 2018లో మూడు హిందీ రాష్ట్రాలలో బీజేపీని కాంగ్రెస్ ఓడించింది. 2023లో కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ కనీస మెజారిటీని కూడా సాధించుకోలేకపోయింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మిత్రపక్షాలపై ఆధారపడడం అనివార్యమయింది. భారతీయ ఓటర్లు అధికారంలో ఉన్నవారిని శిక్షిస్తారని, శిక్షించగలరని ఈ జయాపజయాలు స్పష్టం చేస్తున్నాయి. మోదీపై ప్రభుత్వ వ్యతిరేకత ఎందుకు పనిచేయడం లేదు? ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను ఒక సుస్థిర జాతీయ ప్రత్యామ్నాయంగా ఎందుకు మార్చలేకపోతున్నాయి? మొదటిదానికంటే రెండోదే మరింత ఆసక్తికరమైన ప్రశ్న. ఈ రెండు ప్రశ్నల మధ్య ఉన్న తేడా చాలా ముఖ్యమైనది.

బీజేపీని ఎన్నికల్లో ఓడించడం అసాధ్యం కావచ్చు కానీ ప్రతిపక్షాలు ఆ పార్టీని రాజకీయంగా ఎందుకు ఎదుర్కోలేకపోతున్నాయి, సులభంగా ఎందుకు ఓడిపోతున్నాయని కాంగ్రెస్ తప్పక ప్రశ్నించుకోవాలి. నైరాశ్యానికి లోనవుతూ దాన్ని అధిగమించడానికి ప్రయత్నించకపోతే ఎలా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పన్నెండేళ్లకు పైగా దేశాన్ని పరిపాలిస్తున్నారు. రాజకీయ అలసట, అసంతృప్తి, బలహీనతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాలకు ఇదొక రాజకీయ అవకాశం. అయితే రాజకీయ అవకాశమే రాజకీయ విజయానికి రాచబాట వేయదు. ప్రభుత్వ వ్యతిరేకత అయితే ఉన్నది. దానిని ఓట్లు, సీట్లుగా మార్చడానికి ఒక సువ్యవస్థిత రాజకీయ వేదిక అవసరం.

మళ్లీ రాహుల్‌గాంధీ వద్దకు వెళదాం. తన ప్రశ్నలకు ఈసీఐ సమాధానాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేయడం సమంజసమే. ఎన్నికల సంఘానికి, ఆ మాటకు వస్తే ఏ రాజ్యాంగ సంస్థకు అయినా పారదర్శకత, జవాబుదారీతనం, సంస్థాగత విశ్వసనీయత ఉండడం అవసరం. ఓటర్ల జాబితాపై రగులుతున్న వివాదం స్పష్టం చేస్తున్నదేమిటి? ఈసీఐ తన విధులను మరింత పారదర్శకతతో నిర్వహించాలనే కాదూ? సర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని సంపూర్ణంగా వెల్లడించాలి. దానిని స్వతంత్ర వ్యక్తులు, సంస్థలు పరిశీలించి నిగ్గు తేల్చాలి. ఇది తప్పనిసరి.

ఈసీఐ ప్రమేయం కీలకంగా లేని ప్రాంతాలలో కాంగ్రెస్ పరాజయం పాలయింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు ఘనమైన ఎన్నికల విజయాలు లభించాయి. ఎన్నికల మధ్యవర్తి–– అంటే ఈసీఐ తన విధులు సక్రమంగా నిర్వర్తించనందునే బీజేపీ అసాధారణ విజయాలు మూటగట్టుకుందని విమర్శించడం సబబుకాదు. ఈసీఐ కంటే బాగా సహాయకారి అయిన రాజకీయ, సంస్థాగత, సైద్ధాంతిక, నాయకత్వ కారణాలు బీజేపీ విజయాల వెనుక ఉన్నాయి. ఈ వాస్తవాన్ని విపక్షాలు విస్మరించకూడదు.

# పెద్దపల్లి బీఆర్ఎస్ లో ముసలం...

**ప్రశ్నిస్తే బీసీలపై దాడులా?**
**బీఆర్ఎస్ ముసుగులో అల్లరి మూకల దాడి -**
**దాడికి మాజీ ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలి**
**బిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ గంట రాములు యాదవ్.**

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి జిల్లా:పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇన్ని రోజులు చాప కింద నీరులా దాగి ఉన్న ముసలం బయటపడింది. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను కాపాడుకోవాల్సింది పోయి వారిపైనే దాడులకు ఉసిగొల్పి, అక్రమ కేసులు పెట్టిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఓదెల మండల మాజీ జెడ్పీటీసీ గంట రాములు యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం పెద్దపల్లి ఆర్ కే గార్డెన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

### బీసీల సభలోనే.. బీసీలపై దాడులు..

ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు బీసీలపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని గంట రాములు యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం రంగంపల్లిలోని ఆర్ఆర్ గార్డెన్ లో బీసీలే ముఖ్య ఉద్దేశంగా జరిగిన బీసీ సెల్ సమావేశానికి బీసీలు అందరికీ సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినందుకే బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులపై కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

### బీఆర్ఎస్ ముసుగులో అల్లరి మూకలు...

బీఆర్ఎస్ పార్టీ ముసుగులో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పెంచి పోషిస్తున్న కొందరు అల్లరి మూకలు పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్టీ అంతర్గత వ్యవహారాలపై ప్రశ్నించే హక్కు ప్రతి కార్యకర్తకు ఉంటుంది అన్నారు. ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారు అన్నారు. ఈ ఘటనకు మాజీ ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించాలి" అని డిమాండ్ చేశారు.

### దాడి చేసింది వారే, కేసు పెట్టింది వారే!

దాడి చేసింది వారే, తిరిగి కేసు పెట్టింది వారేనని, ఇది కక్ష సాధింపు చర్య కాదా. అని మండిపడ్డారు. దాడులకు పాల్పడిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని, పోలీసులు రాజకీయ కక్షలకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

### ఎమ్మెల్యే టికెట్ ఎవరి చేతిలో లేదు

ఎమ్మెల్యే టికెట్ ఎవరి చేతిలో లేదని, సర్వేలు, సామాజిక కోణాల్లో అధిష్టానానిదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. కార్యకర్తకు టికెట్ ఇచ్చిన గెలిపించుకుంటామన్నారు. నిజాయితీ గల కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వమని, ఒంటెద్దు పోకడలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

### బీసీల ఐక్యత చాటుతాం, కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాడుతాం

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతును అణచివేయడం సాధ్యం కాదని, బీసీల హక్కుల కోసం, బీసీల ఐక్యత కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, రైతు సమస్యలు, స్థానిక అభివృద్ధి అంశాలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచులు ఉప సర్పంచ్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

**అగ్నిధారన్యూస్, అక్టోబర్ 04, మహమ్మదాబాద్:**

ప్రధానమంత్రినరేంద్ర మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా పఖ్వాడ కార్యక్రమాల్లో భాగంగా మహమ్మదాబాద్ మండల అధ్యక్షులు మూస నరసింహ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.దేశాయిపల్లి ఎక్స్ రోడ్ - నంచర్ల గేట్ బస్టాండ్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పల్లవి కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 70 మంది రక్తదానం చేశారు.అదేవిధంగా పల్లవి ఆడిటోరియంలో డాక్టర్ వెన్న ఈశ్వరప్ప జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 350 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేన్న బసవపురం స్వాముల వారు, రెడ్



క్రాస్ డైరెక్టర్, జేపీఎంసీ విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ... "భరతమాత సేవకే నా జీవితం అంకితం. నా శేష జీవితం ఈ ప్రాంత అభివృద్ధికే కృషి చేస్తాను" అని అన్నారు.ఈ కార్యక్రమాల్లో మహమ్మదాబాద్ మండలాధ్యక్షుడు



మూస నరసింహ, కురువ కృష్ణ, కాశీనాథ్, చిట్యాల యాదగిరి, బద్రి, విష్ణు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదమరిస్తే గుంతలోకే
# రూ.2 కోట్ల రహదారి.. నాణ్యతపై అనుమానాలు

**నాణ్యతను పరిశీలించిన అధికారి ఎవరు?**

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్, అక్టోబరు 4:**

రూ.2 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన నంచర్ల--చౌదర్పల్లి బీటీ రహదారి నిర్మాణ పనుల నాణ్యతపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణం పూర్తయిన కొద్దికాలానికే పలు చోట్ల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మరోవైపు రోడ్డు నిర్మాణానికి అవసరమైన మట్టిని నంచర్ల శివారులో రహదారి పక్కనే తీయడంతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి.

### నాణ్యతను పరిశీలించింది ఎవరు?

రూ.2 కోట్లతో రహదారి నిర్మిస్తుంటే పనుల నాణ్యతను సంబంధిత అధికారులు పరిశీలించారా? కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాడా? రహదారి పక్కన మట్టి తవ్విన తర్వాత గుంతలను ఎందుకు పూడ్చలేదు? ప్రజల సొమ్ముతో నిర్మించిన రహదారిపై అధికారులు నాణ్యతను పర్యవేక్షించారా? లేక పనులు పూర్తయ్యే వరకు మాత్రమే చూసి వదిలేశారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### మలుపు వద్ద మృత్యు ఉచ్చు

నంచర్ల శివారులోని మలుపు వద్ద రహదారి పక్కనే ఉన్న గుంతలు వాహనదారులకు ముప్పుగా మారాయి. రాత్రి వేళల్లో



గుంతలు కనిపించకపోతే వాహనాలు అదుపుతప్పి అందులో పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుడు ఒక్కసారి ఆదమరిస్తే గుంతలోకే.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అని గ్రామస్థులు నిలదీస్తున్నారు.

### ప్రమాదం జరిగే వరకు వేచిచూస్తారా?

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన గుంతలను వెంటనే పూడ్చడంతోపాటు రహదారి నాణ్యతపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు



డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు నాణ్యతను ఎవరు పరిశీలించారు? లోపాలు ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు? గుంతలను ఎవరి అనుమతితో వదిలేశారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి రాకుండా తక్షణమే గుంతలను పూడ్చి, రహదారి నాణ్యతను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నంచర్ల--చౌదర్పల్లి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## బతుకమ్మ కానుకగా మహిళలకు చీరల పంపిణీ



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం,):**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ పండుగ ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. పండుగ సందర్భంగా మహిళల్లో ఆనందాన్ని నింపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని పేర్కొన్నారు. డివిజన్‌లోని పేద కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలను అందజేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కార్పొరేటర్ విజయ మల్లేష్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

## మంచాల ఎల్లమ్మకు ఘన నివాళి



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం) :**

మంచాల పోచన్న యాదవ్ సతీమణి స్వర్గీయ మంచాల ఎల్లమ్మ సంవత్సర కర్మ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, యాదవ సంఘ నాయకులు, ఆత్మీయుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు.ఎల్లమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన పలువురు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె జ్ఞాపకాలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బుస అంజయ్య యాదవ్, సందబోయిన శ్రీనివాస్ యాదవ్, బొబ్బారి కుమార్ యాదవ్, మంచాల రవీందర్ యాదవ్, సందబోయిన ప్రసాద్ యాదవ్, సందబోయిన రవి యాదవ్, బద్దుల రాజ్‌కుమార్ యాదవ్, సుధ యాదవ్, మరక రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో మాంసం విక్రయాలపై ఆరోపణలు



**మాంసం విక్రయాలపై తనిఖీలు చేపట్టాలని స్థానికుల డిమాండ్.**
**అనారోగ్యంతో ఉన్న గొర్రెలు, మేకలను కోసి విక్రయిస్తున్నారంటూ ఆరోపణలు.**

**అగ్నిధార న్యూస్ ,(మంథని,):**

మంథని పట్టణంలో మేకలు, గొర్రెల మాంసం విక్రయాలపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనారోగ్యంతో ఉన్న లేదా బలహీనంగా ఉన్న పశువులను కోసి మాంసంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వస్తున్నాయి. కొందరు వ్యాపారులు ఈ మాంసాన్ని హోటళ్లు, దాబాలకు కూడా సరఫరా చేస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు.సాధారణంగా మాంసం విక్రయించే ముందు సంబంధిత అధికారులు, పశు వైద్యులు జంతువుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వినియోగానికి అనుకూలమైన మాంసాన్ని మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పట్టణంలోని కొన్ని మాంసం దుకాణాల్లో నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బలహీనంగా ఉన్న గొర్రెలు, మేకలను ద్విచక్రవాహనాలపై తరలించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మరికొందరు దుకాణదారులు పాత తేదీలకు సంబంధించిన రశీదులు లేదా స్లిప్పులతోనే విక్రయాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మాంసం నాణ్యత, పశువుల ఆరోగ్య పరిస్థితిపై వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

### అధికారులు తనిఖీలు చేపట్టాలి

పట్టణంలోని మాంసం దుకాణాల్లో మున్సిపల్, పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అనారోగ్యంతో ఉన్న పశువుల మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకోవడంతో పాటు, వినియోగానికి అనుకూలమైన మాంసం మాత్రమే విక్రయించేలా పర్యవేక్షణ పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీ




**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

గోదావరిఖని ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్--సీఐటీయూ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గౌరవాధ్యక్షుడిగా వేల్పుల కుమారస్వామి, అధ్యక్షుడిగా గొట్టే తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా గుడాల రమేష్, కోశాధికారిగా గణిశెట్టి సతీష్, ఉపాధ్యక్షుడిగా బాలే వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా మారబోయిన నాగరాజు, కమిటీ సభ్యులుగా రాయబారపు శ్రీనివాస్, మాడిశెట్టి శ్రీనాథ్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ నెల 9న తెలంగాణ ఆర్టీసీలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గోదావరిఖని డిపోలో నూతన కమిటీ ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు.ఎస్‌డబ్ల్యూఎఫ్, టిడబ్ల్యూయూ, టీఎంయూ(ఏ) కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని తెలిపారు. గోదావరిఖని డిపోలో టిడబ్ల్యూయూ 'బాణం' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు.

## మానవత్వంతో అండగా హరీష్‌రెడ్డి



**అగ్ని ధార న్యూస్ ,(అంతర్గాం):**

పెద్దంపేట్ గ్రామానికి చెందిన మంద మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దశదిన కర్మ కార్యక్రమానికి అవసరమైన 50 కిలోల బియ్యాన్ని విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి అందించారు. గ్రామ సర్పంచ్ అముల పెద్ద శ్రీనివాస్ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులు మంద శేఖర్, కోల బాపులకు బియ్యం అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్య మధుకర్‌రెడ్డి, అఖిల భారత యాదవ సంఘం అంతర్గాం మండల అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు బైరి సురేష్‌గౌడ్, సందనవేన సాయి యాదవ్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# 'అబ్‌కీ బార్.. అన్నీ మాయమేనా?'

**దేశంలో వ్యవస్థల వైఫల్యాలపై సమతా సైనిక్ దళ్ నేత దుర్గం నగేష్ ధ్వజం**
**ఈవీఎంల నుంచి నీట్ వరకు.. పాలకులను నిలదీసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్) :

దేశాన్ని అగ్రపథంలో నడిపిస్తున్నామని చెబుతున్న పాలకుల పాలనలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, వ్యవస్థల పనితీరుపై సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో చోటుచేసుకుంటున్న వివిధ పరిణామాలపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**ఈవీఎంలపై ప్రశ్నలు..**

ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలో పారదర్శకతపై ప్రజలకు అనుమానాలు రాకుండా ఎన్నికల సంఘం పూర్తి వివరాలు వెల్లడించాలని దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. ఈవీఎంల నిర్వహణ, భద్రత, లెక్కింపు ప్రక్రియపై ప్రజలకు స్పష్టత అవసరమన్నారు. ఎన్నికల సంఘం ప్రకారం ఈవీఎంలలో నియంత్రణ యూనిట్, బ్యాలెట్ యూనిట్ ఉంటాయని, వాటి నిర్వహణకు నిర్దిష్ట విధానాలు ఉన్నాయని పేర్కొంది.

**రూ.1,600 కోట్ల బొగ్గుపై లెక్క చెప్పాలి..**

బొగ్గు రంగానికి సంబంధించి రూ.1,600 కోట్ల విలువైన బొగ్గు గల్లంతైందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన కోరారు. దీనిపై సంబంధిత శాఖ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**నీట్ పేపర్ లీకేజీలపై ఆగ్రహం..**

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ వంటి పరీక్షల్లో ప్రశ్నపత్రాల భద్రతపై తలెత్తుతున్న వివాదాలు ఆందోళనకరమని అన్నారు. విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎథనాల్‌పై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి..**

పెట్రోల్‌లో ఎథనాల్ కలపడం వల్ల వాహనాల మైలేజీపై ప్రభావం ఉంటుందన్న ఆందోళనలపై ప్రభుత్వం, వాహన తయారీ సంస్థలు సమగ్ర అవగాహన కల్పించాలని దుర్గం నగేష్ అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం, ఆటోమోటివ్ పరిశోధనా సంస్థల వివరాల ప్రకారం ఈ20 ఇంధనంతో కొన్ని ఈ10 వాహనాల్లో ఇంధన సామర్థ్యం స్వల్పంగా తగ్గవచ్చని, వాహనం రకం, నిర్వహణ, డ్రైవింగ్ పరిస్థితులపై ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నాయి.

**విరాళాల లెక్కలు బహిర్గతం చేయాలి..**

రామమందిర నిర్మాణం కోసం సేకరించిన విరాళాలు, చందాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై పూర్తి లెక్కలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.



ప్రజల నుంచి సేకరించిన నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

**'ప్రజలు కళ్లు తెరవాలి'**

దేశంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని గుడ్డిగా సమర్థించకుండా ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని దుర్గం నగేష్ సూచించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయాన్ని కాపాడేందుకు ప్రజలంతా విజ్ఞతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. "దేశ భవిష్యత్తు కోసం ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు. బాధ్యత కూడా" అని ఆయన పేర్కొన్నారు.

# కరువు కాటుకు రైతన్న విలవిల

**వెంటనే ప్రత్యేక కేబినెట్ భేటీ నిర్వహించాలి**
**టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**
**నవంబర్ వరకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలి..**
**కరువు మండలాలను ప్రకటించాలి**
**ఈవీఎంలకు స్వస్తి.. పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలి**

అగ్నిధార న్యూస్ ,(హైదరాబాద్) :

రాష్ట్రంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వెంటనే ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కరువు తాండవిస్తోందని, కొన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు 20 మీటర్ల లోతుకు పడిపోయాయని కవిత పేర్కొన్నారు. రైతులు పంటలను కాపాడుకోలేక కొన్ని చోట్ల వాటిని కాల్చుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. జూలైలో ఒక శాతం, ఆగస్టులో 38 శాతం, సెప్టెంబరులో 30 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని ఆమె తెలిపారు.

**నవంబర్ వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి**

రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 1.20 కోట్ల ఎకరాల్లో పంటలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాలంటే నవంబర్ వరకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని కవిత డిమాండ్ చేశారు. బోర్ల ద్వారా పంటలను కాపాడుకునే పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా కీలకమన్నారు. గ్రామాల్లో ఆరు నుంచి ఏడు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ రావడం లేదని ఆరోపించారు.

**కరువు మండలాలను ప్రకటించాలి**

మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించాయని, తెలంగాణలోనూ వెంటనే కరువు మండలాలను గుర్తించాలని కవిత కోరారు. కరువు మండలాలను ప్రకటిస్తే కేంద్రం నుంచి సహాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను పరిశీలించి తక్షణ సాయం అందించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ బకాయిలపై ఆరోపణలు

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో గతంలోనే తాము హెచ్చరించామని కవిత అన్నారు. విద్యుత్ సరఫరాపై దాని ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. విద్యుత్ కొరత కారణంగా కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని ఆరోపించారు.

**తాగునీటి సమస్యపై ఆందోళన**

కరువు ప్రభావం భవిష్యత్తులో తాగునీటి సమస్యకు దారితీసే ప్రమాదం ఉందని కవిత హెచ్చరించారు. రిజర్వాయర్లలో నీటిమట్టాలు పడిపోయాయని, కృష్ణా జలాలను కాపాడుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.

**గ్రామాల్లో పర్యటించనున్న పార్టీ నేతలు**

రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు గ్రామాల్లో పర్యటిస్తారని కవిత తెలిపారు. కరువు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఇది ఒక్క శాఖకు సంబంధించిన వైఫల్యం కాదని, మొత్తం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు.

**ఆసుపత్రుల పరిస్థితిపైనా ఆందోళన**

'ఆపరేషన్ బ్లూకోడ్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితులను తమ పార్టీ నాయకులు పరిశీలిస్తున్నారని కవిత తెలిపారు. భూపాలపల్లి ఆసుపత్రిలో సీలింగ్ కూలిన ఘటనను తమ పార్టీ వెలుగులోకి తెచ్చిందన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే కార్యకర్తలను పోలీసులు బెదిరించకుండా సమస్యలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**317 జీవో బాధితులకు న్యాయం చేయాలి**

317 జీవో బాధితుల సమస్యలను ప్రభుత్వం మూడేళ్లుగా పరిష్కరించడం లేదని కవిత ఆరోపించారు. ఆందోళన చేస్తున్న



ఉపాధ్యాయులపై గాంధీ జయంతి రోజున లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. 317 జీవో బాధితుల్లో పోలీసు సిబ్బంది కూడా ఉన్నారని, వారి సమస్యల పరిష్కారానికి కూడా తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు.

**పేపర్ బ్యాలెట్‌తోనే ఎన్నికలు జరపాలి**

ఎన్నికల వ్యవస్థలో శాశ్వత మార్పులు రావాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లోనూ పేపర్ బ్యాలెట్ విధానం అమలులో ఉందని పేర్కొన్నారు. దేశంలో తిరిగి పేపర్ బ్యాలెట్ విధానం తీసుకురావాలని తమ పార్టీ తరఫున ఢిల్లీ వరకు వెళ్లి పోరాటం చేస్తామని తెలిపారు.

**రానున్న ఎన్నికల్లో పోటీ**

ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటు రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా తమ పార్టీ పోటీ చేస్తుందని కవిత వెల్లడించారు. ఎన్నికలను తమ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశంగా భావిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో పాఠశాలల్లో మరుగుదొడ్లు, కనీస మౌలిక వసతులు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించేందుకు పార్టీ బృందాలను ఏర్పాటు చేస్తామని కవిత తెలిపారు.

# ఉషులో సత్తా చాటిన బాలికలు

**అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్‌లో 122 మంది క్రీడాకారిణులు**
**40 స్వర్ణాలు.. 35 రజతాలు.. 16 కాంస్యాలు**

అగ్నిధార న్యూస్ ,(రామగుండం):




ఉషు మార్షల్ ఆర్ట్స్‌లో బాలికలు, యువతులు సత్తా చాటారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని లలిత కళాభవన్ వేదికగా ఆదివారం నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ ఉషు మహిళా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారిణులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. రామగుండం, గోదావరిఖని, కరీంనగర్, పెద్దపల్లి, సింగరేణి కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన 122 మంది బాలికలు, యువతులు పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో 40 స్వర్ణ పతకాలు, 35 రజత పతకాలు, 16 కాంస్య పతకాలు సాధించారు.

**జాతీయ స్థాయికి సావియా అంజలి**

పోటీల్లో ప్రతిభ కనబరిచిన సావియా అంజలి పెద్దపల్లి జిల్లా తరఫున జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. తమిళనాడులో త్వరలో జరగనున్న 25వ జాతీయ జూనియర్ ఉషు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకోవడంతో నిర్వాహకులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో రజత పతకం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**క్రీడలతోనే సమగ్ర వికాసం**

మహిళా సాధికారత, యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా అట్టడుగు స్థాయి క్రీడాకారులకు అవకాశాలు లభిస్తున్నాయని వక్తలు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి ఇలాంటి లీగ్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు. బాలికల్లో క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించేందుకు భవిష్యత్‌లో మరిన్ని పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఉమర్ అబ్దుల్, 24వ వార్డు కార్పొరేటర్ కవిత, పెద్దపల్లి ఉషు అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. రాజ్‌కుమార్, జనరల్ సెక్రటరీ కె. కుమార్, స్పార్క్ లయన్ కుంగ్‌ఫూ గ్రాండ్‌మాస్టర్ ఎం. రాజేశం, హెల్త్‌కేర్ మెడిటేషన్ ఇన్‌చార్జి ఎం.డి. అహ్మద్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

## మధుకర్‌జీని కలిసిన కందుల సంధ్యారాణి



అగ్నిధార న్యూస్ ,(హైదరాబాద్):

తెలంగాణ రాష్ట్ర సంస్థాగత మంత్రి మధుకర్‌జీని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై మధుకర్‌జీతో చర్చించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, కందుల పోషం, జనగామ మండల అధ్యక్షుడు గుండెబోయిన భూమయ్య, మాదాసు వినయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించాలి




**విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**

అగ్ని ధార న్యూస్ (పెద్దపల్లి):

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్సీ, బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, తాగునీరు, వసతి, పారిశుధ్యం, పాఠ్యపుస్తకాలు, విద్యాబోధన తదితర వసతులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గురుకులాల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, భద్రతతో కూడిన వసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గురుకుల పాఠశాలలకు అవసరమైన నిధులు కేటాయించి మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవి పరిష్కారమయ్యే వరకు ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవా దృక్పథం, మానవత్వానికి ప్రతిరూపం



**బొల్లిబత్తుల దేవదాస్**
**అధ్యక్షులు, పద్మశాలి సంఘం గజ్వేల్-ప్రజ్ఞాపూర్**
**జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను సన్మానించడం గజ్వేల్ పద్మశాలి సమాజానికకి పద్మశాలి కి మంచి గుర్తింపు, మన పద్మశాలి కులానికి ఆణిముత్యాలు.**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో సేవా దృక్పథం కలిగిన పద్మశాలి ముద్దుబిడ్డలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాస్ మాట్లాడుతూ "సేవా దృక్పథం కలిగిన ఏడెల్లి బాలకిషన్ దార ప్రభాకర్, అరిగే బాలరాజు, శ్రీ వడ్డేపల్లి లింగం మన గజ్వేల్ పద్మశాలి కులానికి ఆణిముత్యాలు" అని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న గురువులు ఒక తరానికి మార్గదర్శకులు. భావి భారత పౌరులను తయారు చేసే బాధ్యత గురువులపై ఉంది. అలాంటి గురువులు మన కులంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం మన జాతికి, గజ్వేల్ సమాజానికి గర్వకారణం. అరిగే బాలరాజు గారు కులంలో ఎవరైనా చనిపోతే ఆ పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి సొంత ఖర్చులతో భోజనం ఏర్పాటు చేయడం గొప్ప మనసున్న మహనీయుని లక్షణం. జర్నలిస్టు వడ్డేపల్లి లింగం గారు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికై కలం ద్వారా సమాజ సేవ చేస్తూ గజ్వేల్ పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టడం స్ఫూర్తిదాయకం. వీరిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు నడవాలి" అని పిలుపునిచ్చారు. చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం మాట్లాడుతూ వీరిని సన్మానించే బాధ్యత తీసుకున్న పద్మశాలి సంఘం, యువజన సంఘం పాలకవర్గాన్ని అభినందించారు. మాజీ అధ్యక్షులు దేవులపల్లి రాజారాం మాట్లాడుతూ "సేవ అంటే మాట కాదు, చేతల్లో చూపే నైజం. ఒక్కరు మంచి పని చేస్తే ఆ కీర్తి జాతి అందరికీ వస్తుంది. ఒక్కడు చెడ్డ పని చేస్తే జాతికే అవమానం. కాబట్టి సమాజ సేవ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ముఖ్య సలహాదారు స్వర్గం చంద్రం, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, సంయుక్త కార్యదర్శి పాసికంటి శ్రీనివాస్, జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు వల్లందాసు సత్యనారాయణ, యువజన సంఘం ముఖ్య సలహాదారు చంద్రమౌళి, కోశాధికారి దొంతుల ప్రసాద్, కుల పెద్దలు సూరం నాగులు, వీర బాలయ్య, కృష్ణ, సదానందం, మధుసూదన్, దార సంతోష్, నాగరాజు, మల్లేశం, సత్యనారాయణ, యువజన సంఘం ఉపాధ్యక్షులు నర్సింలు, సహాయ కార్యదర్శి రాచకొండ మహేష్, తలకొక్కుల వెంకటేశం, నల్ల శివకుమార్, ఎడెల్లి మహేందర్, ఏడెల్లి విష్ణు, దేవసాని సుధాకర్, మధు, తదితర పద్మశాలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి బీఆర్ఎస్ లో ముసలం...

**ప్రశ్నిస్తే బీసీలపై దాడులా?**
**బీఆర్ఎస్ ముసుగులో అల్లరి మూకల దాడి -**
**దాడికి మాజీ ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలి**
**బిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ గంట రాములు యాదవ్.**

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి జిల్లా



:పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇన్ని రోజులు చాప కింద నీరులా దాగి ఉన్న ముసలం బయటపడింది. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను కాపాడుకోవాల్సింది పోయి వారిపైనే దాడులకు ఉసిగొల్పి, అక్రమ కేసులు పెట్టిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఓదెల మండల మాజీ జెడ్పీటీసీ గంట రాములు యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం పెద్దపల్లి ఆర్ కే గార్డెన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**బీసీల సభలోనే.. బీసీలపై దాడులు..**

ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు బీసీలపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని గంట రాములు యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం రంగంపల్లిలోని ఆర్ఆర్ గార్డెన్ లో బీసీలే ముఖ్య ఉద్దేశంగా జరిగిన బీసీ సెల్ సమావేశానికి బీసీలు అందరికీ సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినందుకే బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులపై కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్ ముసుగులో అల్లరి మూకలు...**

బీఆర్ఎస్ పార్టీ ముసుగులో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పెంచి పోషిస్తున్న కొందరు అల్లరి మూకలు పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్టీ అంతర్గత వ్యవహారాలపై ప్రశ్నించే హక్కు ప్రతి కార్యకర్తకు ఉంటుంది అన్నారు. ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారు అన్నారు. ఈ ఘటనకు మాజీ ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించాలి" అని డిమాండ్ చేశారు.

**దాడి చేసింది వారే, కేసు పెట్టింది వారే!**

దాడి చేసింది వారే, తిరిగి కేసు పెట్టింది వారేనని, ఇది కక్ష సాధింపు చర్య కాదా. ? అని మండిపడ్డారు. దాడులకు పాల్పడిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని, పోలీసులు రాజకీయ కక్షలకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

**ఎమ్మెల్యే టికెట్ ఎవరి చేతిలో లేదు**

ఎమ్మెల్యే టికెట్ ఎవరి చేతిలో లేదని, సర్వేలు, సామాజిక కోణాల్లో అధిష్టానానిదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. కార్యకర్తకు టికెట్ ఇచ్చిన గెలిపించుకుంటామన్నారు. నిజాయితీ గల కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వమని, ఒంటెద్దు పోకడలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

**బీసీల ఐక్యత చాటుతాం, కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాడుతాం**

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతును అణచివేయడం సాధ్యం కాదని, బీసీల హక్కుల కోసం, బీసీల ఐక్యత కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, రైతు సమస్యలు, స్థానిక అభివృద్ధి అంశాలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచులు ఉప సర్పంచ్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## చేర్కూర్ గ్యార్మి ఉత్సవాల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండలం చేర్కూర్ గ్రామంలో ఎం.డి. అలీలుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు. పండుగలు, ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను, పరస్పర స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అదేవిధంగా కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఏడ్మ సత్యం కూడా గ్యార్మి ఉత్సవాల్లో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో పండుగ వాతావరణంలో నిర్వహించిన ఉత్సవాల్లో స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి, చేర్కూర్ గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, మాజీ ఎంపీటీసీలు భీమయ్య గౌడ్, జ్యోతి నిరంజన్, చందు నాయక్, మాజీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జోగయ్య, మాజీ సర్పంచులు అంజి నాయక్, శంకర్ నాయక్, డీలర్ మైసయ్య, ఉప సర్పంచ్ కొండల్, మాజీ ఉప సర్పంచులు నరసింహ ముదిరాజ్, నర్సింహ, వార్డు సభ్యులు పురుగుల లాలయ్య, పురుగుల రమేష్, కేశమోని జంగయ్య, ఆనంద్, పోలె అశోక్, గొర్రె జంగయ్య, సత్యం, మీసాల రాజు, రామరాజు, అల్లే సందీప్, గాండ్ల జంగయ్య, గుడే వెంకటయ్య, జంగిలి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే మత పెద్దలు ఎం.డి. స్కైలాబ్, ఎం.డి. బాబా, ఎం.డి. గౌస్, ఎం.డి. సఖిల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగయ్య, నాయకులు సతీష్, సుభాష్, కృష్ణ, గణేష్, శ్రీనుతో పాటు గ్రామస్థులు, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొని గ్యార్మి ఉత్సవాలను విజయవంతం చేశారు.

## వెల్జాల్‌లో నూతన అబ్బాస్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం



**హాజరైన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అబ్బాస్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన అబ్బాస్ ఫంక్షన్ హాల్‌ను సందర్శించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఎం.డి. మహమూద్ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వివాహాలు, శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఇలాంటి సౌకర్యాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.నూతన ఫంక్షన్ హాల్ ప్రజలకు అందుబాటులోకి రావడం పట్ల సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఫంక్షన్ హాల్ విజయవంతంగా కొనసాగాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఎం.డి. మహమూద్, సర్పంచ్ కళ్యాణ్ నాయక్, మాజీ సర్పంచులు నరేందర్ గౌడ్, శ్రీరాములు, ఉప సర్పంచులు రమేష్ యాదవ్, వార్డు సభ్యులు కాలే మహేష్, సీనియర్ నాయకులు ఎం.డి. జాఫర్, భాస్కర్, విజయ్ కుమార్, సాయి, వెంకటేష్తో పాటు పలువురు నాయకులు, గ్రామస్థులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే మాస్టర్ చింతల జగదీష్ మృతి

**కుటుంబాన్ని పరామర్శించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఆమనగల్ మున్సిపాలిటీకి చెందిన కరాటే మాస్టర్ చింతల జగదీష్ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. జగదీష్ మృతి విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కలిసి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా జగదీష్ కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, మనోధైర్యం కల్పించారు. జగదీష్ మృతి పట్ల గోలి శ్రీనివాస్ రెడ్డి, ఎడ్మ సత్యం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.జగదీష్ కుటుంబానికి ఈ కష్ట సమయంలో తమ సానుభూతి, అండగా ఉంటుందని వారు తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.కరాటే మాస్టర్‌గా జగదీష్ అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు సన్నిహితులు, స్థానికులను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని చింతల జగదీష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## వంగూరులో శ్రీశ్రీశ్రీ గెల్వలాంబ మాత దేవస్థాన నూతన కమిటీ ఎన్నిక

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

గెలిపిస్తే గెల్వలాంబ మాతగా నామకరణం పొంది ఆపద మొక్కుల తల్లిగా పేరుగాంచి వంగూరు మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గెల్వలాంబ మాత దేవస్థానం నూతన కమిటీని గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే నూతన కమిటీకి గ్రామంలోని దేవస్థాన మాజీ కమిటీ సభ్యులు శాశ్వత సభ్యత్వం గల సభ్యులు గ్రామ దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్లు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దల సమక్షంలో అమ్మవారి ఆలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా లట్టుపల్లి చక్రవర్తి ఉపాధ్యక్షులుగా నామ లింగయ్య గుప్త సురభి సుకేష్ రావు ప్రధాన కార్యదర్శిగా చిలికేశ్వరం సైదులు సహాయ కార్యదర్శులుగా కొనింటి బుచ్చి రాములు సిహెచ్ నరసింహ గుప్తా ప్రచార కార్యదర్శిగా పిట్టల రమేష్ కోశాధికారి గుడ్లనర్వ సుమన్ లతో పాటు ముఖ్య సలహాదారులుగా ఎనిమిది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నూతనంగా ఎన్నికైన అధ్యక్షునితో పాటు దేవస్థాన పాలక సభ్యులకు మాజీ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు శాలువాలు కప్పి సన్మానించారు అనంతరం దేవాలయ పూజారి చే ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరినీ సుఖ సంతోషాలతో చూడాలని అమ్మవారి ఆశీస్సులను కోరారు సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడుతూ పాలకమండలి సభ్యులు గ్రామ పెద్దల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్య మాజీ సర్పంచ్ వేనేపల్లి గణేష్ రావు మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీ సభ్యులు తెడ్లపల్లి యాదగిరిరావు అక్కి లావణ్య ఎల్లాగౌడ్ మాజీ దేవస్థానం కమిటీ చైర్మన్ లు జువ్వ కృష్ణయ్య అందుగుల వెంకటస్వామి మాజీ కోశాధికారి సురేష్ గుప్తా మాజీ ఉపాధ్యక్షులు అక్కి మురళి జూలూరి శ్రీనివాస్ గుప్తా ఎల్లా హరినాథ్ ఎల్లా శ్రీనివాసులు ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీశైలం వార్డు మెంబర్లు జంగయ్య లట్టుపల్లి మురళి గ్రామ పెద్దలు నారమోని చంద్రయ్య నామ పాండురంగయ్య గుప్త కర్నాటి గెల్వ య్య ఎర్రవోలు వెంకటేష్ పెంకుల పర్వతాలు ప్రణీత్ రావు నంది కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

## మృతురాలి కుటుంబానికి ధ్యాప నిఖిల్ రెడ్డి ఆర్థిక చేయూత

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన బండి యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ధ్యాప నిఖిల్ రెడ్డి, బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు.కాంగ్రెస్ నాయకుల ద్వారా మృతురాలి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ధ్యాప నిఖిల్ రెడ్డి, 5,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం మానవతా బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, యాదమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు పోలె రాజు, వార్డు సభ్యులు అంజయ్య, వెంకటేష్, అభివర్మ, కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ, నాయకులు భాస్కర్, బ్రహ్మం, సహదేవ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## 2002-2003 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చిన్ననాటి స్నేహాన్ని, మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్న విద్యార్థులు**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

జగదేవపూర్ మండలం మునిగడప గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది. పాఠశాల విద్యను పూర్తిచేసి 23 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరి తమ చిన్ననాటి స్నేహాన్ని, మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం క్లాస్ రూమ్‌లలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య జరిగిన సరదా సంభాషణలు, చదువుకునే రోజుల్లోని మధుర అనుభవాలను ఒకరికొకరు పంచుకుంటూ రోజంతా ఆహ్లాదకరంగా గడిపారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సుగుణకర్ బుద్ధ బాల్ నారాయణ పండిట్ మధు పంతులు మల్లయ్య సురేందర్ మహిపాల్ రెడ్డి రాజు తిరుపతి విద్యార్థులు దర్గయ్య మహేందర్ రాజీకర్ నరేష్ ఎల్లం ఉపేందర్ నందం కృష్ణమూర్తి తిరుపతి గౌరయ్య మురళి నర్సింలు కనకస్వామి జ్యోతి మానస రజిని కవిత నజీమా భార్గవి బాలమణి స్వాతి మున్ని మానస సరిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ నిర్వహణ



**ఆకట్టుకున్న చిన్నారుల కరాటే విన్యాసాలు.**
**ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతో అవసరం**
**ప్రధాన కార్యదర్శి బెల్ట్ మాస్టర్ స్వామీ**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ పట్టణంలో చిన్నారులు తైక్వాండో, కరాటే విన్యాసాలతో ఆకట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, బ్లాక్ బెల్ట్ మాస్టర్ స్వామి సమక్షంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి సంతోష్ కుమార్ గుప్తా, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ దేశబోయిని నర్సింలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో బాలబాలికలకు ఆత్మరక్షణ ఎంతో అవసరమన్నారు. తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం పెరుగుతుందని తెలిపారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తైక్వాండో కేవలం క్రీడ మాత్రమే కాదని, క్రమశిక్షణతో కూడిన విద్య అని అన్నారు. పిల్లల్లో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో తైక్వాండో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మార్షల్ ఆర్ట్స్ వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సెల్ఫ్ డిఫెన్స్, కరాటే విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కలర్ బెల్ట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, బ్లాక్ బెల్ట్ మాస్టర్ స్వామి మాట్లాడుతూ.. తైక్వాండోలో సాధించే సర్టిఫికెట్లు విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత చదువులు, క్రీడా రంగంలో ఉపయోగపడతాయని తెలిపారు. పిల్లల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కనకసేన, చింతకాయల శ్రీనివాస్, రిప్పల స్వామి, బింగి భాస్కర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## -నీట్ ప్రతిభతో సిద్దిపేట మెడికల్ కాలేజ్ సౌమ్య ప్రవేశం



**ఘనంగా సత్కరించిన ఠాగూర్ బాలాజీ సింగ్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన వాటం సౌమ్య తండ్రి శ్రీశైలం నీట్ ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ఎంబిబిఎస్ సీటు 720 మార్కులకు 315 మార్కులు సాధించి.సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందిన సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు ఠాగూర్ బాలాజీ సింగ్.శాలువాతో సత్కరించి తన వంతు 10,000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు.సౌమ్య కుటుంబం నుండి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో సంతోషకరం.ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభవంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం ఆకూడదన్నారు. పేద.వెనకబడిన వర్గాలను విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్.గౌడుగు భానుచందర్.ఎన్ ఎస్ యు వై మండల అధ్యక్షులు కొంక అరవింద్ గౌడ్.మక్బూల్. మాణిక్యం.శ్రీశైలం.దస్తగిరి.తదితరులు పాల్గొన్నారు

## మతసామరస్యానికి ప్రతీకగా సీతాయిపల్లి

**దుర్గామాత ఉత్సవాలకు ముస్లిం సర్పంచ్ రూ.15 వేల విరాళం**

**గాంధారి :** మతసామరస్యానికి ప్రతీకగా గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామం నిలుస్తోంది. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు అన్ని పండుగలను కలిసిమెలిసి నిర్వహించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నిర్వహించనున్న దుర్గామాత ఉత్సవాలకు ముస్లిం సోదరుడైన గ్రామ సర్పంచ్

# ప్రజా సంక్షేమం.. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం

**వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలుసుకున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను వివిధ మండలాల ముఖ్య నాయకుల ద్వారా అందజేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం నాగోల్‌లో మాడ్గుల మండలం అవుర్‌పల్లి గ్రామానికి చెందిన రవికుమార్ గౌడ్ ఏర్పాటు చేసిన వెంచర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంచర్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. తదుపరి ధ్యాప సుగుణమ్మ 12వ రోజు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన ఓబీసీ సమావేశానికి కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండలం నుంచి తరలివెళ్లే బస్సులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఓబీసీల సంక్షేమం, హక్కులు, సామాజిక అభివృద్ధి అంశాలపై నిర్వహిస్తున్న సమావేశానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తదుపరి తలకొండపల్లి చౌరస్తాలో తలకొండపల్లి మండలానికి చెందిన ఓబీసీ నాయకులు, కార్యకర్తల ర్యాలీని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ మూర్తి, మాజీ ఉపసర్పంచ్ అజీజ్, మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వెల్జాల గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన అబ్బాస్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా వెల్జాల గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నూతన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులను అభినందించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఒకే రోజు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సంక్షేమ, సామాజిక, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొనడంతో ఆయా ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండలం మర్రిగుంత తాండ కొత్త తాండ గ్రామానికి చెందిన ఇస్లావత్ దేవా నాయక్ నిన్న రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉప్పల వెంకటేష్ ముఖ్య అనుచరుడు ఇస్లావత్ విజేష్ నాయక్ ద్వారా మృతుడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఉప్పల వెంకటేష్, బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరఫున 3,000 ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఇస్లావత్ విజేష్ నాయక్, ఇస్లావత్ దేవుజా నాయక్, కిషన్ నాయక్, తారాసింగ్, సక్రు నాయక్, సునీల్‌తో పాటు గ్రామ పెద్దలు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాడవ మహాసభ...



**కమాన్ పూర్ మండల అధ్యక్షులుగా కొయ్యడ సతీష్ యాదవ్..!**

అగ్నిధార న్యూస్ కమాన్ పూర్

కమాన్ పూర్ మండల అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులుగా మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన కొయ్యడ సతీష్ యాదవ్ ను నియమించినట్లు ఆ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సందవేణి రాజేందర్ యాదవ్ లు ఒక ప్రకటనలో ప్రకటించారు. అలాగే మండల ఉపాధ్యక్షులుగా అల్లి సురేష్ యాదవ్ (జూలపల్లి), మేకల శంకర్ యాదవ్ (గొల్లపల్లి), ప్రధాన కార్యదర్శిగా మానుక స్వామి యాదవ్ (కమాన్ పూర్), కార్యదర్శిగా చిగుర్ల భూమన్న యాదవ్ (గొల్లపల్లి), సంయుక్త కార్యదర్శిగా ఎంచర్ల శంకర్ యాదవ్ (గొల్లపల్లి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డబ్బేట శ్రీనివాస్ యాదవ్ (కమాన్ పూర్), కోశాధికారిగా బాగారపు పర్వతాలు (నాగారం), సభ్యులుగా పోగుల తిరుపతి యాదవ్ లను నియమించినట్లు వెల్లడించారు.

# ఐఏఎఫ్ కాంట్రాక్టు లభిస్తే.. భారత్‌లో విమానాల తయారీ!

**వాషింగ్టన్/దిల్లీ:** భారత వాయుసేన (ఐఏఎఫ్) కోసం మధ్య తరహా రవాణా విమానాల సరఫరా కాంట్రాక్ట్ కనుక తమకు లభిస్తే, భారత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా దిగ్గజ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్ సీనియర్ అధికారి వెల్లడించారు. 60 మధ్య తరహా రవాణా విమానాలు కొనుగోలు చేసేందుకు 10.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్ల) అంచనా వ్యయంతో, మనదేశం ఆగస్టులో టెండర్ జారీ చేసింది. ఈ కాంట్రాక్ట్ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), మహీంద్రా గ్రూప్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), రిలయన్స్ డిఫెన్స్ సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ భారతీయ సంస్థలు అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ ప్రాజెక్టు బిడ్డింగ్‌లో పాల్గొంటున్నాయి.

**హైదరాబాద్‌లో ఇప్పటికే**

లాక్‌హీడ్ మార్టిన్‌కు టీఏఎస్ఎల్‌తో దీర్ఘకాలంగా భాగస్వామ్యం ఉంది. హైదరాబాద్–వడోదరలో టాటాతో కలిసి సంయుక్తంగా నెలకొల్పిన టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ప్లాంట్లున్నాయి. సీ–130జే విమానాలకు వివిధ విడిభాగాలు, వెనుక భాగంలోని నిర్మాణాలను తయారు చేస్తున్నట్లు లాక్‌హీడ్ మార్టిన్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ – స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాన్ టెన్నీ తెలిపారు. కొత్త ఆర్డర్ లభిస్తే ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. విమానాల తయారీతో పాటు ఇతర కార్యకలాపాలు కూడా భారత్‌లోనే జరిగేలా చూస్తామన్నారు. లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 60 విమానాల్లో 12 విమానాలను పూర్తిగా సిద్ధం చేసిన స్థితిలో భారత్‌కు అందిస్తారు. మిగిలిన 48 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తామని కంపెనీ ప్రతిపాదించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటికే వినియోగిస్తున్న 12 సీ–130జే విమానాలను కూడా అధునాతన కాన్ఫిగరేషన్‌కు అప్‌గ్రేడ్ చేస్తామనీ లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలైతే, ఐఏఎఫ్ వద్ద ఒకే రకమైన అధునాతన కాన్ఫిగరేషన్ కలిగిన మొత్తం 72 విమానాలుంటాయి. ప్రస్తుతం ఐఏఎఫ్ వినియోగిస్తున్న సీ–130జే విమానాలు ఇప్పటివరకు 58,000కు పైగా విమాన ప్రయాణ గంటలను పూర్తి చేశాయి. లద్దాఖ్‌లోని అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఇవి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

## మృతురాలి కుటుంబానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక చేయూత



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

మాడ్గుల మండలం నాగిల్ల గ్రామానికి చెందిన పల్లేటి జంగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. నాగిల్ల మాజీ ఎంపీటీసీ సురమల్ల సత్తయ్య ద్వారా జంగమ్మ మృతి విషయం తెలుసుకున్న గోలి శ్రీనివాస్ రెడ్డి, మృతురాలి కుటుంబ సభ్యులకు 15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, జంగమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు గోలి శ్రీనివాస్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లేటి జంగయ్య, వార్డు సభ్యులు లక్ష్మీ శ్రీశైలం, పల్లేటి చంద్రయ్య, చాట్ల యాదగిరి, చాట్ల రాములు, చాట్ల జంగయ్య, పల్లె రమేష్, పులికంటి ముత్యాలు, మాజీ వార్డు సభ్యులు పులికంటి మహేష్, చాట్ల దశరథ్, చాట్ల వెంకటయ్యతో పాటు గ్రామ పెద్దలు, నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవుని పడకల్ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

దేవుని పడకల్ గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ ఆదివారం హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేకు వినతిని సమర్పించారు.

దేవుని పడకల్ గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా గ్రంథాలయ భవనం మంజూరు చేయాలని సర్పంచ్ ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా గ్రామంలో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మహిళా సమాఖ్య భవనాన్ని త్వరగా ప్రారంభించాలని కోరారు. అలాగే నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల అవసరాలు, మౌలిక వసతుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆయా పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్ కోరారు. ఎమ్మెల్యేను కలిసిన సందర్భంగా గ్రామానికి సంబంధించిన అభివృద్ధి అంశాలను వివరించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇటీవల కూడా ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులపై వినతులు అందించిన సందర్భాలు ఉన్నాయి.

## నిరుపేద కుటుంబ ఇళ్ల నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూత



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మరో కుటుంబానికి చేయూత అందించింది. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన క్యాత్రమోని బాలమణి కుటుంబానికి ఇంటి స్లాబ్ నిర్మాణం కోసం అవసరమైన సిమెంట్, ఇనుము సామగ్రిని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర నాయకులు, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, స్థానిక మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అందజేశారు. నిరుపేద కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే ఉద్దేశంతో ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ సహాయాన్ని అందించారు. ఇంటి నిర్మాణంలో కీలకమైన స్లాబ్ నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇనుము సామగ్రిని అందించడంతో క్యాత్రమోని బాలమణి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్యాత్రమోని బాలమణి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రిని అందించిన ఉప్పల వెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ఇలాంటి సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ ఎంపీపీ సి.ఎల్. శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ వానరాసి రాములమ్మ, వానరాసి వెంకటేష్, ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి, విజయ్ కుమార్, మాజీ జడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ముజ్బార్ రెహమాన్, మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, వార్డు సభ్యులు వట్టేల శేఖర్, లక్కుమాల చెన్నకేశవులు, దుబ్బ గణేష్, నాయకులు నందికొండ వెంకటయ్య, బాలస్వామి, అంజయ్య, క్యాత్రమోని తిరుపతయ్య, సి.హెచ్. గోపాల్, వట్టేల జగన్, చెనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఉప్పల వెంకటేష్ ఆర్థిక చేయూత



**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

అకాల మరణంతో కుటుంబాన్ని కోల్పోయిన బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉప్పల వెంకటేష్ ఆర్థిక చేయూత అందించారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని తిలక్ నగర్ 3వ వార్డుకు చెందిన వారణాసి రామకృష్ణ అకాల మరణం చెందారు. ఈ విషాద విషయం బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల వెంకటేష్, మృతుడి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ అందించిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ మాజీ అధ్యక్షులు బావండ్ల మధు, కార్మిక సంఘం అధ్యక్షులు సూర్యప్రకాష్ రావు, 3వ వార్డు కౌన్సిలర్ రాము నాయక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నూనె శ్రీనివాస్ యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రెండో జిల్లా మంత్రివర్గ సమావేశానికి అంతర్జాతీయ కార్యదర్శి జూలూరి రమేష్

**స్వాగతం పలికి పూల వర్షం కురిపించిన మంత్రి వర్గ సభ్యులు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

హైదరాబాద్ వి--215ఏ రెండో జిల్లా మంత్రివర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంతర్జాతీయ కార్యదర్శి జూలూరి రమేష్ బాబుకు జిల్లా మంత్రివర్గ సభ్యులు ఘన స్వాగతం పలికారు. సమావేశ వేదిక వద్దకు జూలూరి రమేష్ బాబు చేరుకున్న సందర్భంగా జిల్లా మంత్రివర్గ సభ్యులు గులాబీ పూల వర్షం కురిపిస్తూ ఆయనను సాదరంగా వేదికపైకి ఆహ్వానించారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వి--215ఏ రెండో జిల్లా మంత్రివర్గ సమావేశంలో పలు ముఖ్యమైన అంశాలపై చర్చించేందుకు సభ్యులు సమావేశమయ్యారు. అంతర్జాతీయ కార్యదర్శి జూలూరి రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరు కావడంతో సమావేశంలో ప్రత్యేక సందడి నెలకొంది. జిల్లా మంత్రివర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జూలూరి రమేష్ బాబుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సమక్షంలో సమావేశ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.





Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com